



రే మాణిక్యం నువ్వు నాకో పని చేసిపెట్టాలి"

"ఏమిటది ?"

"చేస్తానంటే చెపుతాను "

"చెప్తే చేస్తాను "

"తీరా నే చెప్పాక చెయ్యనంటే ?"

"అనను"

"అనవని నాకు రుజువెట్లా ?"

"అంతమాత్రం నేనంటే నమ్మకం లేకుండా ? చెయ్యదగని పని చెబుతానా నీకు ? నామంచి తనం నీకు తెలీదూ ?"

"సరే, చెప్పు"

చేస్తావన్నమాటేనా, సంతోషం-ఊమురి, నువ్వు అక్కడికి వెళ్లి నా విషయం చెప్పి రావాలి !"

"ఎక్కడికి ?"

"ఆ చంద్రంగారింటికి-"

"చంద్రం ఎవరు ?"

"నీకు తెలీదా ?"

"తెలీదు"

"నే చెప్పలేదూ ?"

"చెప్పలేదు"

"చెప్ప నేలేదూ ? అయితే యెట్లా మరి ? ఆ అమ్మాయి వున్నది చూచావూ, పేరు కమల-అని ! ఆవిడతండ్రి చంద్రంగారంటేను నావిషయం ఆయనతో చెప్పి, వివాహానికి వొప్పించాలి-"

"బాగుంది పని, నేను చెయ్యను-"

"పిడుగా, చేస్తానంటివే ?"

"చేస్తానని నేను వాగ్దానం చెయ్యలేదు "

"నువు చేసినట్లే భావించాను నేను-"

"భావించివుండవచ్చు, అది నాతప్పు గాదు ! అయినా, ఒక వేళ మాటయిచ్చినా, -అది నాకు గుర్తు లేదనుకో-"

"నువ్వింత అబద్ధాలకోరువనుకోలేదు !"

"ఎందుకనుకోలేదు ? నీకు నేను అబద్ధాలాడనని చెప్పానా ? పైగా నేను హరిశ్చంద్రుడిని గాను, కనీసం అతడి ఆరాధకుడిని గాకపోతిని !"

"పోనీ, నీవ్యక్తిగత అభిప్రాయాలు నాకెందుకు ? ఈపని నాకు నువు చేసిపెట్టాలి ? నిన్నే నమ్మకున్నాను-"

"నే నీపని చెయ్యజాలను-"

"ఎందుకని ?"

"నే నెవరినని యీపని చేయుట నిక ?"

"నా స్నేహితుడివి !"

"నువ్వెవరు ?"

"పెండ్లికొడుకును-"

"అబ్బాయ్, అసలే నాది తిరుగుడు బుర్ర. నావల్ల యీ విషయాలు పూర్తి అయ్యేవైతే యిప్పటికి అధమం పాతిక పెళ్లిళ్లయినా చేసుకునుందును !"

"నీకొక్కడుగా యిది, నాకు ! నాకోసం నువ్వెళ్లు. ఈపని నీవల్ల తప్ప, మరెవ్వరి వల్లా గాదు; ఆసంగతి నాకు తెల్సును ?"

"నీకు తెల్సినంతమాత్రాన యీపని కాదోయ్! వెళ్లంటే మహా మురిసిపోతావు గాని, నీదగ్గిర యేవున్నట్లు వివాహ యోగ్యతలు ?"

"లేకేం ? నాది పెళ్లియీడు. కమలకూ అంతే !-"

పెళ్ళియీడువాళ్లందరికీ పెళ్లి అవుతుందా ? మరి నాకొక్కటే లేదేం ?"

"నువు చేసుకోనన్నావు. పోనియ్-కమలా నేనూ ప్రేమించుకున్నాం-"

(20 వ పేజీ చూడండి)

వాత మేలుకొని ఏం లాభం?

మూర్తి : కృంగి కృశించి విడ్వడమే లాభం ఒక అమాయికురాల్ని, నిన్నే దైవమని ఎంచిన ఆమెను రాచిరంపాన బెట్టావు ఆమె వెళ్ళనని మొత్తుకున్నా వినకుండా ఆ మఠంలోకి గెంటావు మానహానికి భయపడి పారిపోయివచ్చిన ఆమెను 'కులట' అన్నావు ఆమెకు నేనాశ్రయమిచ్చాను నన్ను సంఘం, సంఘంతో సహా నీవు ఎదిర్చారు పాపం! ఆమె వెళ్ళిపోయింది ఏ అన్నదమ్ములకోసం, ఏ అక్కచెల్లెకోసం ఆమె తన సౌఖ్యాన్ని తృణీకరించిందో వారినే విడిచి ఎక్కడికో వెళ్ళిపోయింది ఇంతయ్యేదాకా నీకు తెలివిరాలేదు ఆమె చచ్చినా సంఘానికి తెలివి రాదు ఇదేం బ్రతుకు నాన్నా? ఇప్పుడు నీ యంట్లో గాని, ఈ యింట్లోగాని కళాకాంతులున్నాయా? నిజంగా మనం బ్రతికే వున్నామా? మనలో జీవకళ ఉందా?

పంతులు చచ్చిన పాముకు ఇంకా చితకగొట్టి ఏం లాభం బాబూ? ఏమైనా సరే సుగుణను వెదికించు చితికిపోతున్న ఈ కుటుంబాన్ని నిలబెట్టు సుగుణ లేని ఆ యిల్లు యిల్లుగా తెలియడంలేదు అదొక ఘోరీ!

మూర్తి ఎలా వెదికించడం? దినపత్రికలన్నింటిలో నీకు జబ్బుగా ఉందని ప్రకటించాను ఎంతటి ప్రేమమూర్తి అయితేనేం? మనసు విరిగిం తరువాత మరలా అదుకుతుందా?

పంతులు అగుకుతుంది మూర్తీ! నువ్వే అన్నావు సుగుణ నాకు భార్య కావలసింది కాదని నిజమే ఆమె దేవత!

మూర్తి (సంభ్రమంతో ద్వారంవైపు చూచి) అదిగో

(సుగుణ సుడిగాలివలె ప్రవేశిస్తుంది)

సుగుణ (పంతులు కాళ్ళపై బడి) అయ్యో! ఏగా ఐపోయారండి

పంతులు (లేచి కూర్చుని) సుగుణా నువ్వు రావనుకొన్నాం ఇక నా జీవితానికి శాంతి లేదనుకొన్నాను మొదటినుంచీ నీకు ద్రోహమే చేశాను నా తప్పులన్నీ క్షమించు నీవు లేని నా యిల్లు దేవుడులేని గుడి

మూర్తి ఈ నిజం తెలుసుకునేందుకు యింతకాలం పట్టింది!

సుగుణ మూర్తీ! నిజం అంతమాత్రమే కాదు స్త్రీ యింట్లో వున్నంతవరకే సంఘం ఆమెను అనుమతిస్తుంది రావిచెట్టు క్రిందవున్న రాయికి అందరూ నమస్కరిస్తారు అదే రాయి త్రోవలో ఉన్నట్టయితే అందరూ దాన్ని త్రొక్కుతూ వెళ్ళిపోతారు స్త్రీ విషయంకూడా అంతే ఆమె లేనియిల్లు దేవుడులేని గుడి గావచ్చు కానీ గుడిని విడిచిన తరువాత దేవుడెంతవరకూ గౌరవింపబడుతున్నాడు?

(తెర) ★

# గతితప్పిన ప్రణయం

(8 వ పేజీ తరువాయి)

"బైరాగీ! ప్రేమించుకున్నంతమాత్రాన పెళ్ళిళ్లు అయితే యీ ప్రపంచంలో నేను బతికే వుండకపోదును-"

"మరి??"

"నీలో యేం చూసి ఆయన నీకు పిల్లనిస్తాడు?"

"ఏం చూచయినా యివ్వచ్చు నాలో నన్ను చూచి యిచ్చినా యిబ్బంది లేదు!"

"నవ్వాలో, యేడవాలో నాకర్థం గావటం లేదు-"

"ఎందుకు? - మరిచాను, కమలని చూచే నా కిస్తాడు ఆ పిల్ల నన్నొదిలి ఒక్క నిమిషమూ వుండలేదు!"

"వట్టిభ్రమ ఇప్పుడు జరుగుతున్నది కాలం గాదా? ఇవి నిమిషాలు గావా? అయినా, ఆ పిల్లకు తన కుక్కపిల్ల దగ్గర లేకపోతే యేమీ తోచకపోవచ్చును ఈ వెర్రి ఆపేక్షలన్నీ, తీసి అవతల బెట్టు! కానీ చూదాం, ఆ పిల్లకు మరొకడితో పెళ్లి జరిగితే యేమవుతుంది?"

"పెళ్ళి జరగదు!"

"జరిగితేనో?"

"జరగదంటూంటేనా!"

"జరుగుతోంది గదుటోయ్, వెర్రి పుల్లయ్యా"

"ఎప్పుడూ?"

"నే చూచాను విశ్వాన్ని యెరుగుదువా? వాడితో పెళ్లి నిశ్చయం తాంబూలాలు గూడా యిచ్చుకున్నారు"

"నిజంగానా?"

"నిజంగా నిజం! నాకు నీతో అబద్ధం చెప్పాల్సిన అవసరం యేమిటి?"

"లేదనుకో! ఊహు నే నమ్మను నాతో కమల మాటమాత్రంగానైనా చెప్పందేనా! పొద్దు నే అరగంటసేపు మాట్లాడితిని!"

"కమలకూ తెలీక పోవచ్చును! ఆక్షేపణ యేమున్నది?"

"అదెట్లా?"

"ప్రపంచంలో జరిగేవన్నీ అందరికీ తెలుస్తయ్యా? అంతా చంద్రంగారి యేర్పాటేగాని యిందులో నీ, నా, అన దగ్గదేమీ లేదుగదా!-"

"ఆ! నువు చెప్పేవిడ్డూరం అంతా నిజమేనా? నాగతేం గాను? నువు చెప్పిం దాన్లోయేం అబద్ధం లేదుగదా!"

"ఒక్క అక్షరమూ లేదు -"

"నాగతేం గాను"

"నీకేం నిక్షేపరాయుడివి!"

"నిన్న నన్ను కుంరంటివే- నుయ్యో, గొయ్యో చూచుకుంటాను కమల దొరక్కుండా, నా బతుకు నిరర్థకం"

"వెర్రివాడా! కమలను తలదన్నగల సౌందర్యం వున్న ఆడపిల్లలు లక్షమంది వున్నారన్నది-తప్పులేనిమాట!"

"కాదు! కమలకు నాహృదయం అర్పించాను!"

"కుఱ్ఱకుంకవేషాలు నీ కింకా పోలేదురా! ఇతంలో వున్నై నీ తెలివితేటలు! లాభంలేదు అనవసరంగా బుర్రెందుకు పగలగొట్టుకుంటావ్ యీ ప్రేమవిషయాల్లో-?"

"ఏమిటినువు చెప్పేది? నాకర్థం గావటం లేదు"

"ఏమీ లేదు, ఈ పిచ్చి వగులుకో"

"మళ్ళీనా? వొదులుకోను అసలిది పిచ్చవుతేనా!"

"కాకపోతే వెర్రి అంతేగదా పిచ్చికీ వెర్రికీ అంత గొప్ప తారతమ్యం వుంటుందనుకోను!"

"కబుర్లకేం గాని, యీ విషయంలో నీ సలహా చెప్పు!"

"భయపడకు! నే చెప్పింది నిజం గాదు!"

"బతికాను! కాస్తలో చంపేశావు గడుగ్గాయివేషాలు పోని స్థితిగాదు కమల సంగతినాకు తెలీదూ, ఆ పిల్లఅట్లాంటిరకం గాదు గుండె కొట్టుకోటం యింకా ఆగలేదు అయితే, వళ్లు నువు తొందరగా!"

"నేను వళ్లనని మొదటే చెప్పానుగా!"

"పోనీ, యేంచెయమని సలహా?"

"నా సలహాగూడా యిదివరకే చెప్పేశాను!"

"అయినా, చంద్రంగారిదగ్గరికెళ్లటానికి నీ కభ్యంతర మేమిటి?"

"కావలసినంత వున్నది!"

"సూటిగా చెప్పు!"

"నువా పిల్లకోసం యేంపాట్లు పడ్డావు? నువే కష్టాలకోర్చి, అంత్యాన సుఖపడ్డట్టు? ఇంతవరకూ దెబ్బ తినకండానే వస్తివి ఇక ముందైనా-పడు!"

"ఏమిటి?"

"కష్టాలేని ప్రేమ కలకాలం వుండదు అంటారు!"

"—తెలీనివాళ్లు ఇక్కడ కష్టపడటానికేమున్నది? చేతిముందుగా, బంగారం దొరికితే-కష్టాలు పడితే గాని, దొరకదని—"

"నాకదంతా తెలీదు నే పోవాలి యింటికి—"

"నీ యింటి గ్గాదు వాళ్ళయింటికి వెళ్లు రాయబారం!"

"వెళ్లనని చివరిసారిగా చెబుతున్నాను ఈసారి వెళ్లమన్నావా, పరిస్థితి మరీ విషమిస్తుంది నాకు కోపం వస్తే, ఆ చంద్రం యింటికి వెళ్లి మా సిద్ధాంతిగాడికి మీ పిల్ల నియ్యకండి అని చెప్పి రాగల్ను"

"ఆపనిమాత్రం చెయబోకు, నీ పుణ్యమాయిరి నిన్ను బతిమాలుతున్నా, తరుణోపాయం చెప్పు—"

" నిన్ను చూస్తూంటే నాకు జాలి కలుగుతోంది నా వెంటబడ్డావేమిటి?— అయితే చెబుతున్నాను, నువు మహా నీచమైనపని చెయబోతున్నావ్—"

"ఊఁ, పూర్తి చెయ్—"

"ఓ వుత్తరం రాయి ఆయనకి, నీ విషయం సవిస్తరంగా చెబుతూ—'

"న్నేనా? ఎట్లా రాయాలి చెప్పు—"

"అదీ నేనే చెప్పాలా? నువు రాయలేవూ ఆ మాత్రం?—ఆయన్ని ప్రార్థించు, ప్రాధేయపడు-బాగా—"

"నువు చెపుతూంటు, నే రాస్తాను—"

"ఊఁ, కానీ, త్వరగా కాగితం తియ్యి—"

* * *

నాలుగురోజులు గడిచాక—

"మాణిక్యం, నీ సలహా అమోఘంగా పనిచేసింది!"

"చేయదూ మరి, నే చెప్పటమూ-అది విఫలమైపోవటమూనా? ఎన్నటికి అట్లా జరగరాదు!"

"ఇక ముందు ప్రక్రియ గూడా నీ చేతిమీదిగా జరగనీ—"

"చూచావూ, నా సంగతి నువింకా పూర్తిగా గ్రహించలేకపోయావు నా చేతిమీదిగా క్రియలు జరుగనేరవు!" సలహాలు చెప్పటానికి మాత్రం యెవడైనా మన తరవాతే! అయితే వివరంగా, యేమయిందో చెప్పు"

—"ఏమౌతుంది? మనం రాశిన వుత్తరం మీదట, చంద్రంగారు సమాధానం యిచ్చారు చదూతావిను ఆవుత్తరం 'మీ వుత్తరం నేను చూచాను, మీరు రాశిన విషయమై నా అభ్యంతరం యేముంది? పదోతారీకు వుదయం పదిగంటలకు మీరు మాయింటికి రాండి-అన్ని విషయాలూ మాట్లాడుకుందాం స్వయంగా' ఎంత ముచ్చటగా వుందో చూడు వుత్తరం-"

"నీమొహం! చాలా అమర్యాదగావుంది ఆయనే మనయింటికి రావాల్సింది,-"

"నీకంతా అనుమానం ఆయనింటికి నే వెళ్లటం మామూలే గనక, యేమీ అనుకోమని రాశివుంటాడు? అందులో యేమున్నది?"

"దాన్లోనే వున్నది నాకు నమ్మకం లేదు యిది సెటిలవుతుందని? నీకు లేని అభిమానం నాకు దేనికి?-పోనీ, యేంచేదామనుకున్నావ్?"

"నీ అంతటివాడికి అది తోచకండా వుండదు అయితే నన్ను పరీక్షిద్దామని, అడుగుతున్నావనుకుంటాను-చెబుతావిను, మన మిద్దరం వెళ్లి ఆ నిర్ణీత కాలానికి చంద్రంగారింటి దగ్గర హాజరువుదాం తరవాతజరగాల్సినరీతిని జరుగుతుంది"

"నీబుద్ధికింత మాత్రమే తోస్తుంది మరి? నే నెందుకు అక్కడికి?"

"నేను చాలాసేపు ఆలోచించాను నువు రావటం అత్యావశ్యకం"

"ఎ్ల ?"

"నాకు మతి సరిగ్గా వుండదు అదీ గాక, అన్ని విషయాలూ తెలీవు నువు పక్కనుండి ప్రతిక్షణమూ కర్తవ్యం ఆదేశించాలి మొదటిసారే నా అవకతవకతనం వాళ్లకు తెలియరాదని నా అభిప్రాయం—

"ఆ చివరి మాటమీదే నిలబడివుంగు నువు అవకతవకవాడివనే నువేవొప్పుకుంటున్నావుగదూ ఆమాట నేనంటే యెగిరిపడతవు నీమనో దౌర్బల్యం వ్యక్తంఅవుతున్నది యీచిన్న సందర్భంలో నీ గుణగణాలతో నాకేంపని—నీవెంట నేను రాను రావాల్సిన అవసరం నాకు లేదు!"

"నీ కున్నదని నేనన్నానా? నాకోసం, నా క్షేమంకోసం నా శ్రేయస్సుకోసం రమ్మన్నాను-"

"నువు, నీ క్షేమం, నీ శ్రేయస్సు నాకు కావల్సినవేగాని, నీ వెంటరా న్నేను తోకవెంట నారాయణా? నే నేం నోటి పెళ్ళికొడుకునా యేం?"

అబ్బ, నా అభిప్రాయం అర్థంగాలేదు నీకు, క్షమించి——"

"ఆగు-నీకు సలహాయిస్తున్నా-ఆ సమయానికి అక్కడికి వెళ్లు ఆ చంద్రంగారేదో మాట్లాడుతాడు నిన్నుగురించి గొప్పగా చెప్పకో ఆ కమలతో ముందుగా చెప్పు నిన్నుగురించి స్ట్రాంగ్ గారికెమెండ్ చెయ్యమని! అంతే పనిజరిగేదీ, జరగందీ చంద్రం తెలివిమీద ఆధారపడి వుంటుంది!"

"ఉజ్జాయింపుగా యేం జరిగేదీ ఊహించలేవూ?"

"నాకు నమ్మకంలేదని మొదటనే చెప్పా. అయినా అదృష్టాన్ని పరీక్షించుకో-"

"ఏమయినా నువ్వొస్తేనే రైటని వున్నది నాకు నువేమో-"

"కాదులే, నేనురాను నువెళ్లి-పని చూచుకురా,-ఆయన్తో మాటాడిన వెంటనే నన్ను కల్సుకుని, చెప్పు యేం జరిగిందో-"

"సర్లే అంతే చేస్తా!-"

"నువు మాత్రం అక్కడ దర్జాగా ప్రవర్తించాలి! ముభావంగా మాటాడు ఆయన్తో గౌరవానికి లోటు రాకుండా చూచుకో-"

"అది నేను చాలా రోజుల్నించీ అనుకుంటున్నాలే—"

* * *

పదోతారీకు ఒంటిగంటకు—

"ఏంరా, సిద్ధాంతీ - రొప్పుతూ వొస్తున్నావ్-"

"మరిచిపోయావాయేం, యివాళ పదోతారీఖు"

"అదా! వెళ్లొచ్చావా, యేమయింది కాయా, పండా?—చెప్పు—"

"నీ సలహా యేమీ పనిచెయ్యలేదు నే నుట్టి వెధవకింద వాళ్లు జమకట్టుకున్నారు—"

"అదేం? నేను విదవని కాను అని చెప్పలేకపోయినావా?"

"నా మొఱ ఆలకించిం దెవరు? అందుకనే నువ్వూ వెంటవుండాలని కోరింది నా ఖర్మమిట్లా కాలింది మరి!"

"ఎట్లా కాలిందంటావు? వివరం"

"నీమొహం, నా మోహం వివరం యేమిటి నాకు తోదు ఊఁ కానీ, తప్పదు మరి-చేసినపాపం చెబితే పోతుందంటారు!"

"నే చెబితే మరి విన్నావా? ఇంతకన్నా నీచమైనపని వుండబోదని మొదటనే చెబితిని నా సలహా నీవు అనుసరించకపోయేసరికి, నీకు కావాల్సిన అవమానం కావాల్సిందేనని, ప్రోత్సాహం యిస్తూన్నట్లుగా నటిస్తూ వదిలాను నాకు తెల్సు యీ పని జరుగుతుందని, కాకపోతే—"

"మళ్ళీ యీ విషయంలో తలయెత్తకండా జరిగింది పరాభవం కావల్సిందే నాకు వెళ్లగానే దణ్ణం పెట్టాను చంద్రంగాడికి! నీకోసమే కాచుకున్నానన్నాడు.

ఏకవచనం యేమిటని నాలో నేను గొణుక్కున్నా చావుకబురు చల్లగా చెప్పాడాయన వెళ్లగానే 'టీ' యిచ్చాడు పని అవుతుందిగదా అనుకున్నాను—"

"ఇంతకూ యేమని చెప్పాడు?"

"ఇంకా యేడిపించాలనా నన్ను? కానీ, నాఖర్మ-యేం చెయ్యను? 'మా కమలని పెళ్లిచేసుకుందామని వున్నదా నాయనా?' అన్నాడు—"

"మంచిదేగదా? యేమన్నావు?"

"అవునన్నాను నా ఉత్సుకత అంతా చూపాను బూడిదలో పోసిన పన్నీ యింది"

"ఊఁ—"

"ఆశ వొదులుకో అన్నాడు యేం? అన్నాను అంతేనన్నాడు మా కమలని చేసుకోటానికి కలెక్టర్లంత పడిగాపులు పడుతున్నారన్నాడు నాకేం ఆస్తి లేదన్నాడు. వుద్యోగం లేదన్నాడు వాళ్ల కాలిగోరికి నే పోలనన్నాడు బాగా తిట్టాడు భరించలేకపోయాను నన్ను తిట్టటం అన్యాయమన్నాను కమలని బాగా ప్రేమించానన్నాను అభిమానించానన్నాను ప్రతికుక్కా ఆ పని చెయ్యగలదన్నాడు—"

"సరిగ్గా నేనదే అన్నాను—"

"ఇద్దరూ ఒకటే-ఏమయినా, నాకు కమలనియ్యనన్నాడు ఎల్లాగన్నాను నాకేమన్నాడు చస్తానన్నాను చావమన్నాడు—"

"హా, హా, హా, బాగా అన్నాడు వెధవాయీ నువ్వు—"

"ఇకిలించటంగాదు, నాకు జరిగిన పరాభవం, నీకూ జరిగినట్టే—"

"ఎంతమాత్రం కాదు నవ్వినా, నగిసినా అది నా యిష్టం-"

"పోలే-చంద్రాన్ని బాగా తెగనాడాను గెలో టన్నాడు. నేరుగా కమలవున్న గదిలోకి వెళ్లాను నన్ను చూసి ముఖం ముడుచుకుంది ఏమిటీ అన్యాయం అన్నాను ఏమీ తెలీనట్లు నటించింది 'మా నాన్నకి యిష్టం లేదే, యెట్లా?' అన్నది లేచిపోదాం రమ్మన్నాను రానంది ఖచ్చితంగా చెప్పేసింది నన్ను మర్చిపోటానికి ప్రయత్నిస్తానంది నాగతికి తనేం చెయ్యలేనంది పిచ్చెక్కినట్లయింది నీకోసం వెదికాను, ఇక్కడ కనిపించావు"

"హా, హా బాగా, హా" ★

## సినిమా:

# వ్యాపారదృష్టి: సహకారదృష్టి

ఈనాటి చిత్రనిర్మాణధోరణి చూస్తే తెలుగులో ఏటా ఏ 25 చిత్రాలో తయారయేట్టు కనిపిస్తుంది చిత్రం ఒకటికి నాలుగేసి లక్షలచొప్పున చూసుకుంటే ఏటా కోటి రూపాయల చిత్రాలు తయారవుతా యన్నమాట తెలుగు చిత్రాలు చూసే వివిధప్రాంత ప్రేక్షకులద్వారా ఏ మూడు కోట్లో వస్తేనేగాని చిత్రనిర్మాతలకి పెట్టుబడి తిరిగిరాదు

ఈ పరిస్థితిలో చిత్రపరిశ్రమకు డబ్బు ఎవరిస్తున్నారు, పెట్టుబడి చేసేవారి ప్రభావం చిత్రాలమీద ఏవిధంగా ఉంటున్నది, చిత్రాల ఖర్చుపై ఏవిధంగా ఉంటున్నది అని ఆలోచించవలసిందే

చిత్ర నిర్మాణానికి కావలసిన డబ్బంతా నిర్మాతలే తీసుకురావటం లేదు అందులో చాలా భాగం - హెచ్చు భాగం - డిస్ట్రిబ్యూటర్లు ఇస్తున్నారు ఈ పని చేస్తున్నందుకుగాను వీరు వ్యాపారదృష్టితో చిత్రం ఖరీదు పెంచేస్తున్నారు తనకు ఇష్టమైనా లేకపోయినా చిత్రనిర్మాత, డిస్ట్రిబ్యూటరుపై ఆధారపడి చిత్రం తీస్తున్నాడు గనక, తన చిత్రంలో ఖరీదైన తారలను పెట్టాలి, బ్రహ్మాండమైన సెట్టింగులు పెట్టాలి ఉన్న తారలు కొద్దిమందీ, తీసే చిత్రాలు చాలా గనక ఒక్కొక్క తారా అనేక చిత్రాల్లో నటించటం జరిగి, చిత్రనిర్మాణకాలం పెరిగి దానితోబాటు ఖర్చూ పెరుగుతున్నది

డిస్ట్రిబ్యూటరు వ్యాపారదృష్టి సమగ్రమైనదైతే ఆశే చిక్కుండకపోను కాని అదే లేదు డిస్ట్రిబ్యూటరు తనడబ్బు తాను ముందే తీసుకుంటాడు అందుచేత తన డబ్బూ, కమీషనూ వచ్చేదాకా చిత్రం నడిస్తే ఆ తరవాత చిత్రనిర్మాత డబ్బు రాకపోయినా డిస్ట్రిబ్యూటరుకు బెంగలేదు తాను డిస్ట్రిబ్యూట్ చేసే పది చిత్రాల్లో రెంటిమీద దెబ్బతగిలినా డిస్ట్రిబ్యూటరు అంత బాధపడడు అందుచేతనే డిస్ట్రిబ్యూటరు వ్యాపారదృష్టి చిత్రనిర్మాత వ్యాపారదృష్టిని కలుపుకోదు మరోపక్క తారలూ టెక్నిషియనులూ, స్క్రిప్టు రైటర్లూ, ఆర్టిస్టులూ, మ్యూజిషియనులు కూడా వ్యాపారదృష్టికలవారే అయితే చిత్రాల సంఖ్య హెచ్చినకొద్దీ వారు సంతోషిస్తారు ఒక ఏడు వందల చిత్రాలు ప్రారంభించినా వారికి విచారంలేదు ఎందుకంటే నష్టపడే చిత్రంమీదా, లాభంతీసే చిత్రంమీదా కూడా వారికి ఒకటిగానే డబ్బువస్తుంది చిత్రం ఖరీదు పెరిగినకొద్దీ వారికి మరింత ఆనందం

సినిమా చిత్ర నిర్మాణం వ్యాపారమైనప్పుడు అందులో వ్యాపారదృష్టికి ప్రాధాన్యం ఉండటం సబబే అయికూడా ఒకరి వ్యాపారదృష్టి ఒకరిది కానందువల్లా, ఒకరి లాభనష్టాలు మరొకరివి కానందువల్లా ఈ వ్యాపారదృష్టి చిత్రపరిశ్రమకు లాభించకుండా ఉంది చిత్రనిర్మాణఖర్చు పరిమితంగా ఉండటంవల్ల లాభం పొందగలవాడు చిత్రనిర్మాత ఒకడే అయిపోతున్నాడు ఇదికూడా అందరు చిత్రనిర్మాతలకూ వర్తించదు ఎవరిపైనా పెట్టుబడి కొరకు ఆధారపడని చిత్రనిర్మాతలు సయితం నిర్మాణవ్యయం పెంచేస్తున్నారు ఈ విధంగా చేస్తే వారు చిల్లర ప్రొడ్యూసర్లతో పోటీ చేయగలరు ఎందుచేతనంటే చిల్లర ప్రొడ్యూసర్లు డబ్బును డిస్ట్రిబ్యూటరు వగైరాలపై దుర్వినియోగపరచి చిత్రం తీస్తుంటే స్వతంత్ర చిత్రనిర్మాత చిత్రం విలువ హెచ్చించటానికిగాను డబ్బు వ్యయపరచి తన చిత్రంతో ఇతర చిత్రాలు పోటీ చెయ్యలేకుండా చూసుకుంటాడు అదీ వ్యాపారదృష్టే

ఈరకం వ్యాపారదృష్టిమూలంగా రెండు ఫలితాలు ప్రత్యక్షంగా కనిపిస్తున్నాయి ఒకటి, ఏటా కొన్ని పిక్చర్లు దివాలాతీసి కొందరు చిత్రనిర్మాతలు చేతులు కాల్చుకోవటమూ, కొత్తరకం భావాలుకలవాళ్లు చిత్రనిర్మాణానికి పూనుకునే అవకాశం లేకపోవటమూనూ చిత్రనిర్మాణాన్ని శాసించే డిస్ట్రిబ్యూటర్లు తాత్కాలికంగా విజయంపొందుతున్న రకాల చిత్రాలు తీయటానికైతే డబ్బిస్తారుగాని కొత్తరకం చిత్రాలు తీయటానికీ, కొత్త నటులను తీసుకురావటానికీ డబ్బివ్వరు తమకు లోగడ లాభాలిచ్చిన రకాలు అపజయం పొందటం ప్రారంభిస్తే డిస్ట్రిబ్యూటర్లు వ్యాపారం మానుకుని మళ్లీ ఏరకం చిత్రాలకు ప్రజాదరణ లభించేదీ నిర్ణయమయేదాకా చేతులు కట్టుకు కూచుంటారుగాని